క్లుప్తంగా

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించిన తర్వాత కాలువ ఇలా..

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: పట్టణంలోని మల్లిఖార్జునకాలనీ, బొబ్బిలి జంక్షన్, మెంతిపేట, సారధి తదితర వార్డుల్లోని మురుగు కాలువల్లో రోజుల తరబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సోమవారం తొలగించారు. ఆయా ప్రాంతాల్లోని కాలువల్లో విపరీతంగా చేరిన ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాల కారణంగా కాలువల్లోని మురుగునీరంతా బయటకు వెళ్లలేని దుస్థితిపై ఈ నెల 30వ తేదీన సాక్షి దినపత్రికలో 'వ్యర్థాలు ఇలా.. నీరు వెళ్లేదెలా?' అనే శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ కాలువలు సోమవారం పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో గ్యాంగ్ వర్క్ చేయించారు. కాలువల్లో గుట్టలుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి, డింపింగ్ యార్డుకు తరలించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామభద్రపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రత్నం ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సోమవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, చలించిపోయారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ డోల తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు కర్రి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా బజారు ఏర్పాటు



డ్వాక్రా బజారును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా బజారు సోమవారం ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన వివిధ వస్తువులు, పదార్థాలను బజారులో విక్రయానికి అందుబాటులో ఉంచారు. ఒక్కో సంఘం నుంచి ఒక్కో యూనిట్(షాపు) ఏర్పాటు చేశారు. బజారును మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి పరిశీలించారు. బజారులో లభ్యమయ్యే నాణ్యమైన వస్తువులు, పదార్థాలను కొనుగోలు చేసుకోవాలని ప్రచారం చేశారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రేగిడి: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని సోమరాజుపేట గ్రామ రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈకేవైసీ చేయించుకుంటేనే బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. మండలంలో 90 శాతం మేర ఈకేవైసీ పూర్తయిందన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నోటీస్ బోర్డులో సోమవారం ప్రదర్శించారు. జాబితాలోని వివరాలు సరిచూసుకోవాలని ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దారు మల్లెపు రెడ్డి శ్రీను, ఎన్నికల డీటీ బలివాడ గౌరీశంకరరావులు తెలిపారు. మొత్తం ఓటర్లు 775 మంది కాగా వీరిలో మహిళా ఓటర్లు 233 మంది, పురుషులు 542 మంది అని తెలిపారు. అత్యధికంగా బొబ్బిలి మండలంలో 564 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా బాడంగి మండలంలో 57 మంది ఓటర్లు ఉన్నారు.

- వరికోతల తర్వాత దుబ్బులు కాల్చొద్దు
- కాల్చితే తేమశాతం తగ్గిపోతుంది..
- నేలలో కలియదున్నితే లాభాలు

కాల్చితే కాలుష్యం.. దున్నితే భూసారం!



పొలాల్లో వరికొయ్యలు ఇలా కాల్చితే ఉపయోగం లేదు..

రాజాం సిటీ:

రైతులంతా ప్రస్తుతం వరికోతలు పూర్తిచేసుకుని, నూర్పిడి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. చాలాచోట్ల వరి కోసిన తర్వాత మిగిలిన వరి కొయ్యలు(దుబ్బులు)కు నిప్పంటించి కాల్చేస్తున్నారు. దీంతో పొలంలో చేరిన కీటకాలు, వ్యాధికారక సూక్ష్మజీవులు నశింపజేయవచ్చని రైతులు భావిస్తుంటారు. కానీ పర్యావరణ కాలుష్యం ఏర్పడడంతో పాటు భూసారాన్ని పెంచే సూక్ష్మజీవులు నశిస్తున్నాయన్న విషయం వారికి తెలియడం లేదు. ఈ నేపథ్యంలో వరి కొయ్యలను అలాగే ఉంచితే భూసారం పెరిగి తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. యంత్రాలతో నూర్పిడి చేసినా కూడా మిగిలిన వరి దుబ్బులను కాల్చవద్దని సలహా ఇస్తున్నారు.

50 శాతం పంట అవశేషాలు..

వ్యవసాయ రంగంలో వచ్చిన యాంత్రీకరణ మూలంగా రైతులు వరి కోతలకు యంత్రాలు ఉపయోగించి, 30 సెంటీమీటర్ల ఎత్తులో వరికోతలు చేయడం వల్ల 50 శాతం గడ్డికొయ్యల రూపంలో పంట అవశేషాలు మిగిలిపోతున్నాయి. ఈ విధంగా ఎకరాకు రెండు టన్నుల మేర వరికొయ్యలు, గడ్డి రూపంలో మిగిలిపోతున్నాయి. వీటిని రైతులు కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం జరుగుతోంది. టన్ను వ్యర్థాలు తగులబెట్టడం వల్ల 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు 1400 కిలోల కార్బన్‌డయాక్సైడ్ గాలిలోకి విడుదలవుతాయి. అంతేకాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడంతో వాయుకాలుష్యం పెరిగి భూసారం తగ్గుతుంది. నేల పొరల్లో తేమశాతం కూడా ఆవిరై, పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

దున్నితే ప్రయోజనం..

ప్రతి టన్ను వరిగడ్డి పెరగడానికి భూమి నుంచి 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరం, 18.9 కిలోల పొటాష్, కొద్దిమోతాదులో సూక్ష్మపోషకాలు అవసరమవుతాయి. అందుకే కోతలు జరగ్గా మిగిలిన వరికొయ్యలను కలియదున్నితే ఆయా పోషకాలన్నీ తిరిగి నేలను చేరుతాయి. లేదంటే పంట వ్యర్థాలను ముడి పదార్థాలుగా వాడుకొని కంపోస్ట్ పద్ధతి ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. వరికోసిన వెంటనే మిగిలిన తేమను ఉపయోగించుకోవడం వల్ల వరి కొయ్యలు మట్టిలో కలిసిపోయి కుళ్లిపోవడం జరుగుతుంది. వరినాట్లు వేయడానికి ముందు దమ్ము చేసేటప్పుడు ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ వేయడం వల్ల కొయ్యలు తొందరగా కుళ్లి సేంద్రియ పదార్థాలుగా మారుతాయి. వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బన్ శాతం పెరగడమే కాకుండా దిగుబడి 8 నుంచి 10 శాతం పెరిగినట్లు పరిశోధనల ద్వారా తెలుస్తోంది. భూ భౌతిక లక్షణాలు మెరుగుపడి, పోషకాల లభ్యత పెరుగుతుంది. భూమి వేడెక్కడానికి ప్రధాన కారణమైన కార్బన్ డయాక్సైడ్ సాంద్రత తగ్గించాలన్నా.. నేలలో కర్బన్ శాతం పెరగాలన్నా వ్యవసాయ వ్యర్థాలను తిరిగి నేలకు చేర్చడమే ఉత్తమ పద్ధతి.

నిప్పు.. పర్యావరణానికి ముప్పు..



చాలామంది వరిపంటను కోసిన తర్వాత ఆ భూమిలోని కీటకాలు, హానికర సూక్ష్మజీవులు చనిపోతాయన్న అపోహతో వరి కొయ్యలు, యంత్రాలతో కోత చేయగా వచ్చిన గడ్డికి నిప్పు పెడుతుంటారు. ఇది పర్యావరణానికి ముప్పు. అలా చేయకుండా వరికొయ్యలను అదే నేలలో కలియదున్నుకోవాలి. అలా అయితే భూసారం పెరుగుతుంది. పంటలు బాగా పండుతాయి.

– ఎం.రేణుకాసాయి, వ్యవసాయాధికారి, రాజాం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రామభద్రపురం: మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ షస్‌ను సోమవారం సందర్శించిన ఆయన.. రికార్డులతో పాటు అండర్ ఇన్విస్టిగేషన్ కేసులను తనిఖీ చేశారు. గంజాయి, నల్లమందు పట్టుకోవడంతో పాటు పలు కేసుల దర్యాప్తులో సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు, కానిస్టేబుల్ విష్ణుల పనితీరును ప్రశంసించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి ప్రమాదాలు జరగకుండా చూస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే రూ.10 వేల జరిమానా విధించడంతో పాటు నెల రోజుల జైలుశిక్ష ఉంటుందన్నారు. డిసెంబరు 31వ తేదీ రాత్రి జరిగే నూతన సంవత్సరం వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బైక్‌లపై దూకుడుగా వెళ్లడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేయొద్దన్నారు. డీజే సౌండ్లతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని సూచించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన సిబ్బందిని సత్కరించారు.

రాజాం సిటీ: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. ఇదే విషయమై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ డిసెంబరు 31వ తేదీన జరుపుకునే న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనే యువత నిబంధనలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై వేడుకలు చేసుకోవద్దని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సకాలంలో భూ సమస్యలు పరిష్కరిస్తాం

రాజాం:

సకాలంలో భూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు ఎస్.కె.రాజు రైతులకు హామీ ఇచ్చారు. మండలంలోని ముద్దాడజోగివలస(ఎంజీవలస) గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయనకు పలువురు రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రాజశేఖర్, ఆర్ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, జోడిబందల గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు చిన్నారావుకు వినతిపత్రాలు అందించారు.

● బేడా బుడగ జంగాలను ఆన్‌లైన్‌లో చేర్చాలి



బేడా బుడగ జంగం కులాన్ని ఆన్‌లైన్‌లో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోతి సింహాచలం విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై ఆయన తెర్లాం తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై, తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో తమ కులం పేరు లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇదివరకు తమ కులాన్ని ఎస్సీల్లో చేర్చాలని అడిగామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ కూనాయవలస గ్రామ అధ్యక్షుడు గంట సత్యం తదితరులు పాల్గొన్నారు. – తెర్లాం

● అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ ఇటీవల రాజ్యసభలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బొబ్బిలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వామపక్షాల నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసనకు దిగారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు తొలగిస్తూ అందరికీ సమాన అవకాశాలు, న్యాయం కలిగేలా అంబేడ్కర్ రాజ్యాంగం రూపొందించారని, అటువంటి మహనీయుడిపై మంత్రి హోదాలోని వ్యక్తి అవమాన వ్యాఖ్యలు చేయడాన్ని యావత్తు దేశ ప్రజలు ఖండిస్తున్నారన్నారు. ఆయనను ప్రధాని మోదీ సైతం వెనకేసుకుని వస్తుండడం దురదృష్టకరమన్నారు. అనంతరం దక్షిణ దేవి సెంటర్‌లో నిరసనకారులంతా మానవహారంగా ఏర్పడి బీజేపీ డౌన్ డౌన్ అని నినాదాలు చేస్తూనే అమిత్‌షా రాజీనామాకు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.పుణ్యవతి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

● న్యాయవాదుల నిరసన



రాజాం కోర్టు ఆవరణలో న్యాయవాదులు సోమవారం నిరసన చేపట్టారు. రాజాం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనంతపురంలోని సీనియర్ న్యాయవాది శేషాద్రిపై లక్కిరెడ్డిపల్లి సీఐ శాంతిలాల్ అమానుషంగా ప్రవర్తించడాన్ని న్యాయవాదులు తప్పుపట్టారు. అంతేకాకుండా న్యాయవాది మృతికి కారణమైన సీఐపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రామినాయుడు, ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, కార్యదర్శి వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. – రాజాం సిటీ

సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు

రేగిడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో సీజనల్ వ్యాధులు–వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేడి, వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఫాస్ట్ ఫుడ్ తినవద్దని తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులందరి ఆరోగ్యం తనిఖీ చేసి, పలు ఆరోగ్య సలహాలు సూచించారు.

సృజనకు సాన.. వైజ్ఞానిక ప్రదర్శన

దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన–2025లో భాగంగా మండల స్థాయిలో సోమవారం చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. బెంగుళూరుకు చెందిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ సంస్థ సహకారంతో రాష్ట్ర పాఠశాల విద్య, ఎస్ఎస్ఏ(సర్వ శిక్ష అభియాన్) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఎనిమిది అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి, ప్రదర్శించారు. ఎంఈవోలు ప్రాజెక్టులను సందర్శించి, విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలకు సాన(పదును) పెడితే ఉత్తమ ఆవిష్కరణలు బయటపడతాయని, వారిని ఎప్పుడూ ప్రోత్సహించాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బొబ్బిలి: బహుమతులు అందజేస్తున్న ఎంఈవో లక్ష్మణరావు



బొబ్బిలి: విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన



జిల్లా స్థాయి విజ్ఞాన ప్రదర్శన పోటీలకు ఎంపికైన బాడంగి హైస్కూల్ విద్యార్థుల జీన్ థెరపీ ప్రాజెక్టు



రేగిడి: మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన సైన్స్ ప్రాజెక్టులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవోలు ప్రసాదరావు, ఎరకయ్య



బాడంగి: విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈవోలు లక్ష్మణదొర, రాజేశ్వరి

సంక్షిప్తంగా...

చురుగ్గా ఫీవర్ సర్వే



వన్నలిలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: మండలంలోని వన్నలి, అక్కన్నఅగ్రహారం, గుళ్లపాడు, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో ఫీవర్ సర్వే చురుగ్గా సోమవారం చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న జ్వరాలు, వాటి బారినపడకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన వైద్యారోగ్య సిబ్బంది కల్పించారు. ప్రతీ ఇంటికి వెళ్లి, జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించారు. అలాగే ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

కళాశాల అభివృద్ధికి 'ఓల్డ్ ఫ్రెండ్స్' సహకారం

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో వంట గది నిర్మాణానికి ఓల్డ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు చర్యలు తీసుకున్నారు. నిర్మాణం పనులను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్‌లు ప్రిన్సిపాల్ ఎం.కామేశ్వరరావుతో కలిసి సోమవారం పరిశీలించారు. తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి ఇలా తమవంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగభూషణరావు, గాయత్రి, మధు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమించి ఉద్యోగం సాధించాలి

బొబ్బిలి: స్థానిక క్రీడా మైదానంలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షల నిమిత్తం వ్యాయామం సాధన చేస్తున్న పలువురు అభ్యర్థులను డీఎస్పీ పి.శ్రీనివాసరావు సోమవారం కలిసి పలు సూచనలు చేశారు. పట్టుదలతో శ్రమించి, ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగానే జరుగుతుందని, ఎవరూ పోస్టుల భర్తీలో అక్రమాలు జరుగుతాయన్న అపోహ పడొద్దన్నారు. ప్రతిరోజూ బాగా చదివి, వ్యాయామం చేసి సిద్ధం కావాలన్నారు.

భూముల రిజిస్ట్రేషన్‌కు చర్యలు తీసుకోండి



తహసీల్దారుకు సమస్య వివరిస్తున్న డి.గదబవలస గ్రామస్తులు

తెర్లాం: తమ భూముల రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం కల్పించాలని పుల్లేరువలస రెవెన్యూ పరిధిలోని రైతులు కోరుతున్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో డి.గదబవలస ఎంపీటీసీ బెవర వెంకట శేషగిరి, మాజీ సర్పంచ్ వావిలపల్లి ఆదినారాయణతో పాటు పలువురు రైతులు తహసీల్దారు హేమంత్‌కుమార్‌ను సోమవారం కలిసి ఈ సమస్యను వివరించారు. గ్రామంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో ఈ సమస్యను తెలియజేశామని, 50 ఏళ్లుగా భూముల రిజిస్ట్రేషన్ జరగకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జి.సత్యనారాయణ, మండల సర్వేయర్ సాయి తదితరులు ఉన్నారు.

తూతూమంత్రంగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

రామభద్రపురం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తూతూమంత్రంగా కొనసాగుతోంది. పలు శాఖల అధికారులు కార్యక్రమానికి గైర్హాజరవుతుండడంతో చాలా ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రోజుల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు కూడా ఆ కార్యక్రమానికి వెళ్లి, ఫిర్యాదు చేసేందుకు అంతగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 15 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా, ఎంపీడీవో, తహసీల్దారు, ఏపీవో, ఈవోపీఆర్‌డీ, ఐసీడీఎస్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీహెచ్‌డబ్ల్యూ తదితర 8 శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగతా 7 శాఖల అధికారులు హాజరుకాలేదు.

అగ్నిప్రమాద బాధితులకు 'రెడ్‌క్రాస్' సాయం



అగ్నిప్రమాద బాధితులకు సాయమందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

సంతకవిటి: మండలంలోని సిరిపురంలో అగ్నిప్రమాద బాధితులకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు కిచెన్ సెట్లతో పాటు టార్పాలిన్లు, దోమతెరలు, చీరలు, తువ్వాళ్లు, దుప్పట్లు సోమవారం వితరణ చేసి, తమవంతు సాయం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు బి.సత్యం, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొట్ల అప్పలనాయుడు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కొత్త సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్య కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.